సాక్షి రంగారెడ్డి

గురువారం । 28 । నవంబర్ । 2024



కేరాఫ్ అడ్రస్ లేదు!

ఏ అడ్రస్ లేనివాళ్లకు నగరంలోని కొన్ని ప్రాంతాలు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్నాయి. 8లో▸



పల్లె ప్రగతితో..

పల్లె ప్రగతి కార్యక్రమంతో గ్రామాలు అభివృద్ధి చెందాయని కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి పేర్కొన్నారు. 8లో▸



కేసులు పరిష్కరించాలి

కేసులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని డీసీపీ శ్రీనివాస్ పోలీసులకు సూచించారు. 8లో▸

విలీన పంచాయితీ

- కందుకూరు, మహేశ్వరం, చేవెళ్ల మున్సిపాలిటీల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- సమీప గ్రామాల విలీనాన్ని వ్యతిరేకిస్తున్న ప్రజలు
- నిర్మాణ అనుమతులు, ఆస్తిపన్ను వసూళ్ల పేరిట భారం
- తమ గ్రామాలను మున్సిపాలిటీలో కలపొద్దని కలెక్టర్‌కు వినతులు



కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లాలో కొత్తగా మూడు మున్సిపాలిటీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు ప్రతిపాదనలు పంపాలని పురపాలకశాఖ.. జిల్లా పంచాయతీ అధికారులకు లేఖ కూడా రాసింది. కందుకూరు, మహేశ్వరం, చేవెళ్ల మండల కేంద్రాల సమీప గ్రామాల జాబితాను సిద్ధం చేయాల్సిందిగా ఆదేశించింది. ఈ ఆదేశాలకు అనుగుణంగా జాబితాను జిల్లా యంత్రాంగం పంపింది. అయితే తమను కనీసం సంప్రదించకుండా, తమ అభిప్రాయాలను సేకరించకుండా తమ గ్రామాలను ప్రభుత్వం ఏకపక్షంగా ఎలా మున్సిపాలిటీల్లో విలీనం చేస్తుందని మాజీ ప్రజాప్రతినిధులు సహా ఆయా రాజకీయ పార్టీల స్థానిక నాయకులు ప్రశ్నిస్తున్నారు. విలీనం ప్రక్రియను అడ్డుకుని తీరుతామని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే పలు గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాలు సైతం అందజేస్తున్నారు. అయితే ఈ అంశంపై పురపాలకశాఖ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోననే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.

అభ్యంతరాల వెల్లువ

ప్రస్తుతం జిల్లాలో బండ్లగూడ జాగీర్, బడంగ్‌పేట్, మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్లు సహా షాద్‌నగర్, కొత్తూరు, శంకర్‌పల్లి, ఆమనగల్లు, ఇబ్రహీంపట్నం, పెద్ద అంబర్‌పేట్, ఆదిబట్ల, తుర్కయంజాల్, తుక్కుగూడ, జల్‌పల్లి, శంషాబాద్, మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలు ఉన్నాయి. గ్రేటర్ విస్తీర్ణంలో భాగంగా ప్రభుత్వం ఇప్పటికే ఓఆర్ఆర్‌కు అటు ఇటుగా విస్తరించి ఉన్న గ్రామాలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేసిన విషయం తెలిసిందే. పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీలో బాచారం, తారామతిపేట్, గౌరెల్లి, కుత్బుల్లాపూర్ గ్రామాలను విలీనం చేసింది. అదే విధంగా తుక్కుగూడలో హర్షగూడను విలీనం చేసింది. ఇక శంషాబాద్ మున్సిపాలిటీలో బహదూర్‌గూడ, పెద్ద గోల్కొండ, చిన్న గోల్కొండ, హమీదుల్లానగర్, రషీద్‌గూడ, ఘాన్సిమియాగూడలను విలీనం చేసి రికార్డులను స్వాధీనం చేసుకుంది. తాజాగా అవుటర్‌కు బయట మరో మూడు మున్సిపాలిటీల ఏర్పాటుకు కసరత్తు ప్రారంభించింది. ఆయా కేంద్రాల్లో ఆశించిన సంఖ్యలో ఓటర్లు లేకపోవడంతో సమీప గ్రామాలను విలీనం చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావించిన ఫోర్త్‌సిటీకి ఆనుకుని ఉన్న మీర్‌ఖాన్‌పేట్, బేగరికంచె, అన్నోజిగూడ, రాచలూరు, తిమ్మాపూర్, గుమ్మడవెల్లి, కటికపల్లి, జైత్వారం, కొత్తగూడెం, కొత్తూరు, గూడూరు, బైరాగిగూడ, నేదునూరు, దెబ్బగూడ, ఆకులమైలారం గ్రామాలను కలుపుకొని కందుకూరు కేంద్రంగా కొత్త మున్సిపాలిటీ ఏర్పాటు చేయాలని భావిస్తోంది. అదే విధంగా తుమ్మలూరు, సిరిగిరిపురం, గంగారం, ఉప్పుగడ్డ తండా, కేసీతండా, మోహబత్‌నగర్, ఎండీతండా, మన్సాన్‌పల్లి, గట్టుపల్లి, ఆకన్‌పల్లి, రాంచంద్ర గూడ గ్రామాలతో మహేశ్వరం కేంద్రంగా మరో మున్సిపాలిటీ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోంది. కందవాడ, పలుగుపట్ల, మల్లారెడ్డిగూడ, మల్కాపూర్, ఇబ్రహీంపల్లి, దేవునిఎర్రవెల్లి, దామరగిద్ద, రామన్నగూడ గ్రామాలను కలుపుకొని చేవెళ్ల కేంద్రంగా మున్సిపాలిటీ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులతో కనీసం సంప్రదించకుండానే ప్రభుత్వం ఏకపక్షంగా ఈ నిర్ణయం తీసుకోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఉపాధిహామీ ఉండదు



మాది వ్యవసాయ కూలీ ఆధారిత గ్రామం. మండల కేంద్రానికి ఆరు కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. తమ గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేయడం వల్ల పేదలు ఉపాధి హామీ కూలీని కోల్పోతారు. ఇంటి నిర్మాణానికి అనుమతులు, ఆస్తిపన్ను చెల్లింపులు భారమవుతాయి. అభివృద్ధి సహా ప్రతీ చిన్న పనికి మున్సిపాలిటీ పాలక మండలిపై ఆధారపడాల్సి వస్తోంది. గ్రామ పంచాయతీ ఉంటే సర్పంచ్, వార్డు సభ్యులే అన్నీ దగ్గరుండి చూసుకుంటారు.

– బక్కయ్య, దేవుని ఎర్రవెల్లి

రాజకీయ అవకాశాలకు దూరం



మద్యం నియంత్రణ, ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి విషయంలో కలిసికట్టు నిర్ణయాలు తీసుకుంటున్నాం. ప్రభుత్వంపై ఆధారపడకుండా గ్రామాభివృద్ధికి తోడ్పడుతున్నాం. తమ గ్రామానికి జిల్లాలో మంచి గుర్తింపు తెచ్చుకున్నాం. తమ గ్రామాన్ని ఉన్నఫలంగా మున్సిపాలిటీలో కలపడం వల్ల తాము ఇప్పటి వరకు ఉన్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు వంటి రాజకీయ అవకాశాలు దూరమవడంతో పాటు గ్రామానికి ఉన్న గుర్తింపు సైతం కోల్పోతాం.

– సామ రంగారెడ్డి, దేవునిఎర్రవల్లి

కూలీ దొరకదు



ముచ్చర్ల, సాలరావులపల్లి రెవెన్యూల్లో పేద గిరిజనులే అధికం. వీరికున్న కొద్దిపాటి భూములను ఫార్మాసిటీ పేరుతో ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. వ్యవసాయ పంటల సాగు కూడా లేదు. పరిశ్రమలు కూడా రాకపోవడంతో ఆయా గ్రామాల్లోని ప్రజలంతా ఉపాధి హామీ కూలీపైనే ఆధారపడి జీవిస్తుంటారు. ఆయా గ్రామాలను ప్రతిపాదిత కొత్త మున్సిపాలిటీలో విలీనం చేస్తే..నిరుపేద గిరిజనులు మళ్లీ రోడ్డున పడే పరిస్థితి. ఉన్న చిన్నపాటి ఉపాధి అవకాశాన్ని లేకుండా చేయొద్దు.

– వెంకట్రామిరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్, కందుకూరు



విద్యార్థులతో మాట్లాడుతున్న విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

నాణ్యమైన భోజనం అందించాలి

- విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి
- శేరిగూడ ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తనిఖీ

ఇబ్రహీంపట్నం: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి ఏజెన్సీ నిర్వాహకులు, ఉపాధ్యాయులకు సూచించారు. హాస్టళ్లు, పాఠశాలల్లో భోజనం సరిగా ఉండటం లేదనే విషయమై రాష్ట్రంలో జరుగుతున్న సంఘటనల నేపథ్యంలో బుధవారం ఆయన ఇబ్రహీంపట్నం మండలం, శేరిగూడ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను బుధవారం సందర్శించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు, ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీయగా.. భోజన చార్జీలు పెంచాలని, గ్యాస్ సిలిండర్లు, వంట సామగ్రి పంపిణీ చేయాలని, మార్కెట్ ధర ప్రకారం గుడ్ల రేటును పెంచాలని కోరారు. నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అనంతరం మురళి విద్యార్థులతో ముచ్చటించారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను ప్రభుత్వానికి విన్నవించి, పరిష్కారానికి కృషిచేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు, సూపరింటెండెంట్ హైమావతి, ఎంఈఓ హీర్యానాయక్, హెచ్ఎంలు శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, మధ్యాహ్న భోజన కార్మికులు ఖాజాబీ, శిరీష, నస్రీన్, నజీయాలు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలు సహకరించాలి



పారిశ్రామికవేత్తలతో సమావేశమైన అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పారిశ్రామిక వేత్తలు తమ సామాజిక బాధ్యతగా విద్య, వైద్యం మెరుగు కోసం తమవంతు సహకారాన్ని అందజేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ప్రధాన పరిశ్రమల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరోగ్యం, విద్య కోసం అన్ని పరిశ్రమలు సామాజిక బాధ్యత కింద సహకరించాలని కోరారు. పాఠశాలలో అవసరమైన మౌలిక సదుపాయాలు, ఫర్నిచర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన వసతులు కల్పించాలని తెలిపారు. ఇప్పటికే వివిధ రంగాల్లో సామాజిక బాధ్యత కింద సహకారం అందిస్తున్న పారిశ్రామికవేత్తలందరినీ అభినందించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జిల్లా అధికారి శ్రీలక్ష్మి, ప్రధాన పరిశ్రమల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఈవీఎంల ద్వారానే ఎన్నికలు

కలెక్టర్ నారాయణరెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికలను ఈవీఎంల ద్వారానే నిర్వహించాలని భారతదేశ అత్యున్నత న్యాయస్థానం (సుప్రీం కోర్టు) ఆదేశించిందని, ఈవీఎంల వినియోగాన్ని న్యాయస్థానం సమర్థించిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల్లో వినియోగించే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం) ట్యాంపరింగ్‌కు అవకాశమే లేదని కోర్టు వ్యాఖ్యానించిందని, భారత ఎన్నికలలో పేపర్ బ్యాలెట్ విధానాన్ని మళ్లీ ప్రవేశపెట్టాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని దేశ అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసిందని, ఈవీఎంల ట్యాంపరింగ్ పై పిటిషనర్ చేసిన వాదనలను న్యాయస్థానం తిరస్కరించిందని పేర్కొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

డీటీడీఓ రామేశ్వరిదేవి



వసతి గృహ సంక్షేమాధికారికి సూచనలిస్తున్న డీటీడీఓ రామేశ్వరి దేవి

కడ్తాల్: ఆశ్రమ పాఠశాలలతో పాటు, వసతిగృహాల్లో ఉంటూ విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని గిరిజన సంక్షేమ అభివృద్ధి జిల్లా అధికారి(డీటీడీఓ) రామేశ్వరిదేవి అన్నారు. బుధవారం మండల పరిధిలోని మైసిగండి గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల వసతిగృహం పరిసరాలను, వంటగది, స్టోర్‌రూం, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీటీడీఓ రామేశ్వరిదేవి మాట్లాడుతూ.. వసతి గృహ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని.. మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. విద్యార్థులకు తరుచూ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేయాలన్నారు. పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ఆయా తరగతులలోని సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమాధికారి బాలరాజు, జూనియర్ అసిస్టెంట్ నర్సింహారెడ్డి ఉపాధ్యాయులు ఉన్నారు.

కళాశాల నిర్మాణానికి రూ.25లక్షల విరాళం



ఎమ్మెల్యేకు చెక్కు అందజేస్తున్న యుగేంధర్‌రెడ్డి

షాద్‌నగర్: పట్టణంలో దాతల సహకారంతో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి కొత్తూరు మండలం పెంజర్ల గ్రామానికి చెందిన మామాడి యుగేంధర్‌రెడ్డి రూ.25లక్షల విరాళం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, కాశీనాథ్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, విశ్వం, కొంకళ్ల చెన్నయ్య, బస్వం, మహ్మద్ ఇబ్రహీం, కట్టా వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పించండి

ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కె.రామస్వామి



మాట్లాడుతున్న రామస్వామి

మొయినాబాద్: భవన నిర్మాణ కార్మికుల అడ్డాల వద్ద ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కె.రామస్వామి అన్నారు. మొయినాబాద్‌లోని లేబర్ అడ్డాలో బుధవారం భవన నిర్మాణ కార్మికుల సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల అడ్డాల వద్ద ప్రభుత్వం తాగునీటి సదుపాయం, మొబైల్ టాయిలెట్స్, రూ.5కే భోజనం వంటి సదుపాయాలను కల్పించాలన్నారు. కార్మికులంతా ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల ఇన్‌చార్జి సత్యనారాయణ, సీపీఐ మండల కార్యదర్శి కె.శ్రీనివాస్, నాయకులు శివయ్య, శంకర్, దర్శన్, రాజు, మల్లేష్, కేశవులు, నర్సింలు, యాదమ్మ, జ్యోతి, కళ తదితరులు పాల్గొన్నారు.

'ఐక్యత' సేవలు అభినందనీయం



సమావేశంలో మాట్లాడుతున్న రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని నిరుపేదలకు ఐక్యత ఫౌండేషన్ తరఫున నిరంతరాయ సేవలు అందిస్తున్నామని సంస్థ చైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని శ్రీలక్ష్మి గార్డెన్స్‌లో తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరంలో 4,100 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 2,800 మందికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. మరో 162 మందికి ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు శంకర్, ఆస్త, రాజు, ఐక్యతను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్చుకోవాలి

విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వెంకటేశం



మాట్లాడుతున్న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వెంకటేశం

నందిగామ: విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమ శిక్షణతో కూడిన విద్యను నేర్చుకోవాలని ఇందుకు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కృషి చేయాలని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.వెంకటేశం అన్నారు. మండల పరిధిలోని కన్హా శాంతి వనంలోని హార్ట్‌ఫుల్‌నెస్ లెర్నింగ్ సెంటర్ స్కూల్‌లో బుధవారం పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బి. వెంకటేశం హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు ఇష్టమైన రంగాల్లో రాణించేందుకు దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా 'ఆనందోత్సవం అతుల్యం భారతం' అనే పేరుతో భారత దేశంలోని సాంస్కృతిక సంప్రదాయాలు, పండగలు, ఆధ్యాత్మిక అంశాలతో కూడిన పలు కార్యక్రమాలను నిర్వహించారు. చిన్నారుల నృత్యాలు, నాటికాలు, సంగీత కచేరీలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు

షాద్‌నగర్ భూములు బంగారమే

- తెలంగాణ బియ్యానికి విదేశాల్లో మంచి డిమాండ్
- వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పెద్ద పీట
- మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు
- మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం



మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

షాద్‌నగర్: రాష్ట్ర రాజధానికి అతి సమీపంలో ఉండటంతో పాటు రీజనల్ రింగ్ రోడ్డు లోపల ఉన్న షాద్‌నగర్ భూములు బంగారం కానున్నాయని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవానికి బుధవారం ఆయన స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణం నుంచి మార్కెట్ యార్డు వరకు కాంగ్రెస్ శ్రేణుల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వేదపండితులు పూర్ణకుంభంతో మంత్రికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తుమ్మల మాట్లాడుతూ.. దేశంలో అత్యధికంగా వరి పండించిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. వ్యవసాయ రంగం అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఇందులో భాగంగానే బడ్జెట్‌లో రూ.47 వేల కోట్లు కేటాయించిందని స్పష్టంచేశారు. 66 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారన్నారు.

కోహెడలో మోడల్ మార్కెట్

తెలంగాణలో పండించిన బియ్యానికి మలేసియా, ఫిలిప్పీన్స్ దేశాల్లో మంచి డిమాండ్ ఉందన్నారు. బియ్యం ఎగుమతుల కోసం కోహెడాలో రూ.వెయ్యి కోట్లతో మోడల్ మార్కెట్ నిర్మించనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్న సందర్భంగా పాలమూరులో నిర్వహించే రైతు పండగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు మరో రూ.3 వేల కోట్ల రుణమాఫీ ప్రకటన చేయనున్నారని చెప్పారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని విమర్శించారు. పాలమూరు జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని స్పష్టంచేశారు. షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని పౌల్ట్రీ రైతులకు పన్ను బకాయిలు ఎత్తివేస్తామన్నారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా సులోచన, వైస్ చైర్మన్‌గా బాబర్‌ఖాన్‌తో పాటు డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ నాగేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, బీష్వ కిష్టయ్య, నాయకులు కాశీనాథ్‌రెడ్డి, రఘునాయక్, శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, కృష్ణారెడ్డి, తిరుపతిరెడ్డి, విశ్వం శివశంకర్‌గౌడ్, మహ్మద్ ఇబ్రహీం, జమ్రుద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పాలకవర్గం రైతులకు అందుబాటులో ఉండాలి: ఎమ్మెల్యే

షాద్‌నగర్ రూరల్: పాలకవర్గ ప్రమాణస్వీకారోత్సవంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. నూతన పాలకవర్గం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. దళారీ వ్యవస్థ నిర్మూలనకు పాటుపడాలన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 24వేల మంది రైతులకు రూ.180 కోట్లు రుణమాఫీ చేశామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పాలనలో అన్ని విధాలుగా వెనుకబడిన ఉమ్మడి కొందుర్గు మండలానికి నూతన మార్కెట్ కమిటీ ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కోరారు. ఇందుకు స్పందించిన మంత్రి ఏర్పాటుకు హామీ ఇచ్చారు. తనను గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. జూనియర్ కళాశాల నిర్మాణమే తన లక్ష్యమని అవసరమైతే విరాళాలైనా సేకరించి నిర్మాణం పూర్తి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాదయ్యయాదవ్, శివశంకర్‌గౌడ్, తాండ్ర విశాల శ్రవణ్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, కాశీనాథ్‌రెడ్డి, జమ్రుద్‌ఖాన్, ఎండీ.ఇబ్రహీం, రఘునాయక్, పురుషోత్తంరెడ్డి, కొంకళ్ల చెన్నయ్య, చెంది తిరుపతిరెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, చల్లాశ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి ముఖ్యమంత్రి పెద్దపీట



మంత్రికి జ్ఞాపికను బహూకరిస్తున్న వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ సులోచన

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. బుధవారం హిమాయత్‌నగర్ చౌరస్తాలోని స్వామి నారాయణ గురుకుల్ అంతర్జాతీయ పాఠశాల ప్రాంగణంలో రాష్ట్ర స్థాయి క్రీడోత్సవాలను ఆ పాఠశా పరపూజ్య సుకువల్లభ దాసుజీ స్వామిజీ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో 108 పాఠశాలల నుంచి 10,130 మంది విద్యార్థులు పాల్గొన్నారు. నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న ఈ పోటీలను మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మట్లాడుతూ.. క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటుగా స్నేహ బంధాలు పెరుగుతాయన్నారు. అనంతరం రెనో ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, స్వామి నారాయణ గురుకుల్ పరమపూజ్య వల్లభ దాసుజీ స్వామిజీలు మాట్లాడుతూ.. క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్య ప్రయోజనాలుంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కృష్ణచరణ్‌దాస్‌జీ, విశ్వదర్శన్‌దాస్‌జీ, హాస్టల్ ప్రిన్సిపాల్ ఆర్.పి.ప్రవీణ్‌కుమార్, సి.హర్షగౌతమ నాయుడు, ప్రధానోపాధ్యాయులు శేషుబాబు, ఫిషర్‌మెన్ చైర్మన్ నారాయణపురం మహేందర్‌ముదిరాజ్, వివిధ పాఠశాలల అధ్యాపకులు, క్రీడోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేరాఫ్ అడ్రస్ లేదు!



సాక్షి, సిటీబ్యూరో: ఏ అడ్రస్ లేనివాళ్లకు నగరంలోని కొన్ని ప్రాంతాలు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్నాయి. సిటీలోని బహిరంగ ప్రదేశాల్లో ఆశ్రయం పొందుతున్న వీరు స్వచ్ఛంద సంస్థలు, ప్రార్థన స్థలాలు, జీహెచ్ఎంసీపై ఆధారపడి బతికేస్తున్నారు. అనునిత్యం నిషాలో జోగుతూ, ఘర్షణలకు దిగుతూ స్థానికంగా ఇబ్బందులు సృష్టిస్తున్నారు. ఇలాంటి వారిలో కొందరు కొన్ని నేరాలు చేస్తున్నప్పటికీ తీవ్రమైతే తప్ప రికార్డుల్లోకి ఎక్కట్లేదు. గతంలో నగర పోలీసు విభాగం ఈ అభాగ్యుల డేటాబేస్ నిర్వహించింది. ప్రస్తుతం ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవకపోవడంతో వీరికి అడ్డూ అదుపు లేకుండా పోతోంది.

కనెక్టివిటీ ఉన్న ప్రాంతాల్లోనే..

ఈ అపరిచితుల సమస్య ప్రధానంగా ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి రవాణా సౌకర్యం ఉన్న ప్రాంతాల్లోనే ఎక్కువగా ఉంటోంది. సికింద్రాబాద్‌లోని క్లాక్ టవర్, రైల్వేస్టేషన్, పాస్‌పోర్టు కార్యాలయం చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు నాంపల్లి, జేబీఎస్, సీబీఎస్ తదితర చోట్ల వీరు కనిపిస్తుంటారు. వీరిలో కొందరు మతిస్థిమితం సరిగా లేక ఇలా వస్తుండగా... మరికొందరు కుటుంబీకులతో సరిపడక, ఇబ్బందుల నేపథ్యంలో వచ్చేస్తున్నారు. ఫుట్‌పాత్‌లు, పార్కులతో పాటు బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో జీవిస్తున్నారు. అనివార్య కారణాల నేపథ్యంలో ఇలాంటి అభాగ్యుల్లో అనేక మంది గంజాయి, వైట్‌నర్, మద్యంతో పాటు వివిధ రకాలైన మత్తు టాబ్లెట్లకు బానిసలుగా మారుతున్నారు. ఆ మత్తులో ఘర్షణలకు దిగడంతో పాటు స్థానికంగా అనేక సమస్యలు సృష్టిస్తున్నారు.

గతంలో డేటాబేస్ క్రియేట్ చేసిన పోలీసులు...

ఈ అభాగ్యులు, అనాథలు నేరాలకు పాల్పడుతుండటంతో నాంపల్లి పోలీసులు గతంలో డేటాబేస్ ఏర్పాటు చేశారు. రైల్వే స్టేషన్‌తో పాటు పబ్లిక్‌గార్డెన్‌లో వీరి బెడద ఎక్కువగా ఉంటుంది. దీంతో మధ్య మండల అధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టడం ద్వారా వీరి డేటాబేస్ రూపొందించారు. అందులో పేరు, ఫొటో, చిరునామాతో పాటు వేలిముద్రల్నీ సంగ్రహించి స్టోర్ చేశారు. దీనివల్ల భవిష్యత్తులో జరగరానిది జరిగితే ఈ డేటా ఉపయుక్తంగా మారుతుందని ఈ చర్యలు తీసుకున్నారు. అయితే కాలక్రమంలో పోలీసులు వీరి మాట పూర్తిగా మర్చిపోయారు. అయితే షెల్టర్ హోమ్స్‌కు లేదా స్వస్థలాలకు పంపాలని, లేదంటే కనీసం వీరిపై కన్నేసి ఉంచడంతో పాటు డేటాబేస్ రూపొందించాలని పలువురు కోరుతున్నారు. అలాకాకుంటే భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని స్పష్టం చేస్తున్నారు.

సిటీలోని బహిరంగ ప్రదేశాల్లో పలువురి నివాసం

- మద్యం, గంజాయి, వైట్‌నర్ మత్తులో జోగుతూ నేరాలు
- తరచూ ఘర్షణలతో స్థానికులకు ఇబ్బందులు
- గతంలో డేటాబేస్ రూపొందించిన పోలీసులు
- ప్రస్తుతం పట్టనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

పొట్ట నింపుతున్న స్వచ్ఛంద సంస్థలు..

ఇలా బహిరంగ ప్రదేశాల్లో జీవిస్తున్న వారిలో కొందరు చిన్న చిన్న పనులు చేసుకుని పొట్ట పోసుకుంటున్నారు. వీరికి జీహెచ్ఎంసీ నిర్వహిస్తున్న రూ.5 క్యాంటీన్లు ఆకలి తీరుస్తున్నాయి. అత్యధికులు మాత్రం కొన్ని స్వచ్ఛంద సంస్థలు, ప్రార్థన స్థలాలు, నగర వాసులు అందిస్తున్న ఆహారం తిని బతికేస్తున్నారు. ఇలాంటి వారిలో కొందరు స్థానికంగా ఉన్న దుకాణాలు, వాహనచోదకులు, పాదచారుల నుంచి చిన్న చిన్న దొంగతనాలు చేస్తున్నారు. ఏదైనా పెద్ద ఉదంతం చోటు చేసుకున్నప్పుడు మాత్రమే రికార్డుల్లోకి ఎక్కుతున్నారు. అయితే ఈ నేరాలపై ఫిర్యాదు చేయడానికి ఎవరూ ఆసక్తి చూపకపోవడం వీరికి కలిసి వస్తోంది. నగరంలో విదేశీ వీవీఐపీల పర్యటనలు ఉన్నప్పుడు మాత్రమే యంత్రాంగాలకు వీరితో పాటు బిచ్చగాళ్లు గుర్తుకు వస్తుంటారు. ఆ సమయంలో హడావుడిగా షెల్టర్ హోమ్స్‌కు తరలించే అధికారులు ఆపై వీరి విషయం మర్చిపోతుంటారు.

చదువుపైనే దృష్టి సారించాలి

బాలికలకు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శంకర శ్రీదేవి సూచన



మాట్లాడుతున్న జడ్జి శంకర శ్రీదేవి

ఇబ్రహీంపట్నం: చదువుపైనే బాలికలు శ్రద్ధ పెట్టాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శంకర్ శ్రీదేవి అన్నారు. బాల్య వివాహ ముక్త భారత్ పిలుపు మేరకు లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో బుధవారం ఇబ్రహీంపట్నంలోని ఆశ్రిత బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కృషి, పట్టుదలతో విద్యనభ్యసించి, ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకెళితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. మైనర్ వివాహాలు చట్ట వ్యతిరేకమన్నారు. 18 సంవత్సరాలలోపు వివాహాలు చెల్లవని, అలాంటి వాటిని ప్రోత్సహించిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. చెడు మార్గాల్లోకి వెళ్లి తల్లిదండ్రులకు తలవంపులు తీసుకురావొద్దని బాలికలకు సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నరేండ్ల అంజన్‌కుమార్ రెడ్డి, జాయింట్ కార్యదర్శి ధనంజయ్యగౌడ్, కాలేజీ ప్రిన్సిపాల్ రవికుమార్, న్యాయవాదులు రమేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు వెళ్లొస్తూ.. కానరాని లోకాలకు

బైక్ ఢీకొని కూలీ మృతి

షాద్‌నగర్‌రూరల్: బంధువుల అంత్యక్రియలకు వెళ్లొస్తూ రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద శివారులో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎల్లంపల్లి(రంగసముద్రం) గ్రామానికి చెందిన పర్వతాలు యాదవ్(55) రోజువారి కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయన బుధవారం తన సైకిల్‌పై షాబాద్ మండలం కక్కులూరు గ్రామంలోని బంధువుల అంత్యక్రియలకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యలో మొగిలిగిద్ద శివారులోకి రాగానే ఎదురుగా వచ్చిన ఆయన్ని బైక్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పర్వతాలుయాదవ్ అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై వెలుతున్న యువకుడికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం స్థానికులు ఓ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

కేసులు త్వరితగతిన పరిష్కరించాలి

- రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్
- శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిశీలన



సిబ్బందితో మాట్లాడుతున్న డీసీపీ శ్రీనివాస్

శంకర్‌పల్లి: పోలీస్ స్టేషన్‌కి వచ్చే కేసులను త్వరితగతిన పరిష్కరించి, బాధితులకు న్యాయం చేయాలని రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ శంకర్‌పల్లి పోలీసులకు సూచించారు. బుధవారం స్థానిక ఠాణాని ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. స్టేషన్ పరిసరాలను, రికార్డులు, రిసెప్షన్, స్టేషన్‌లోని వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. స్టేషన్‌లో రికార్డులను పక్కాగా మెయింటెన్ చేయాలని, బాధితుల నుంచి ఫిర్యాదు అందగానే సత్వరమే స్పందిచాలన్నారు. అదే విధంగా కేసుల దర్యాప్తులో వివరాలను లోతుగా సేకరించాలన్నారు. విధి నిర్వహణలో పోలీసులు నిర్లక్ష్యం వహించొద్దని, అలాంటి వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో నార్సింగి ఏసీపీ రమణగౌడ్, శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్ గౌడ్, ఎస్సై సత్యనారాయణ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

అమీర్‌పేట మెట్రో స్టేషన్‌లో ప్రయాణికుడి మృతి

అమీర్‌పేట: అమీర్‌పేట మెట్రో స్టేషన్‌లో ఓ ప్రయాణికుడు మృతి చెందిన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం రాత్రి అమీర్‌పేట మెట్రోరైలు ప్లాట్ ఫాం నెంబర్ 1లో ఓ వ్యక్తి ఉన్న ఫలంగా కుప్పకూలడాన్ని గుర్తించిన సిబ్బంది అతడికి ప్రాథమిక చికిత్స అందించడంతో పాటు సీపీఆర్ చేశారు. అయినా ఫలితం లేకపోవడంతో సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి ఒంటిపై ఎలాంటి గాయాలు లేకపోవడంతో హార్ట్ స్ట్రోక్ కారణంగా మృతి చెంది ఉండవచ్చని అనుమానిస్తున్నారు. మృతుడి వద్ద లభించిన ఆధారాలతో అతను ఏపీలోని ఫిరంగిపురకు చెందిన బాలస్వామి సుధీర్ (39) గుర్తించారు. నగరంలోని కొత్తపేటలో ఉంటూ సింపోర్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేస్తున్నట్లు నిర్ధారణకు వచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి..

యువకుడి దుర్మరణం

మొయినాబాద్: బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై మొయినాబాద్ మండల పరిధిలోని రాణే ఇంజన్‌వాల్వ్ కంపెనీ వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షాబాద్ మండలం బొబ్బిలిగామ గ్రామానికి చెందిన బంటు శివ(21) నగరంలో ప్రైవేటు జాబ్ చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన శివ స్నేహితుడు రిషివర్ధన్ బండ్లగూడలో ఇంటర్ చదువుతున్నాడు. కాగా మంగళవారం సాయంత్రం రిషివర్ధన్, శివకు ఫోన్ చేసి నేను కూడా ఇంటికి వస్తాను అప్పా జంక్షన్ వద్దకు రమ్మని చెప్పాడు. పని ముగించుకుని రాత్రి 10 గంటలకు శివ అప్పా జంక్షన్ వద్దకు బైక్‌పై వచ్చాడు. ఇద్దరు కలిసి అక్కడి నుంచి ఇంటికి వెళ్లేందుకు బయలుదేరారు. హైదరాబాద్–బీజాపూర్ జాయతీ రహదారిపై రాణే ఇంజన్ వాల్వ్ కంపెనీ వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న శివకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. రిషివర్ధన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మోదీ పాలనలో దేశం పటిష్టం

బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్‌యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న కుమార్‌యాదవ్

చేవెళ్ల: నరేంద్రమోదీ పాలనలో దేశం ఎంతో పటిష్టంగా మారిందని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్ యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం బీజేవైఎం చేవెళ్ల కన్వీనర్ దారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదుపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేవైఎం రాష్ట ఉపాధ్యక్షుడు కుమార్‌యాదవ్ హాజరై మాట్లాడారు. సభ్యత్వ నమోదును పెద్ద ఎత్తున నిర్వహించి ఇచ్చిన లక్ష్యాల కంటే ఎక్కువ మొత్తంలో చేయించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. పార్టీ పటిష్టత కోసం పని చేయాల్సిన బాధ్యత బీజేవైఎం కార్యకర్తలపై ఉందన్నారు. యువతకు బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు చేసిన మోసాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. హైడ్రా పేరుతో హైడ్రామా చేశారని, ఇప్పుడు మూసీ ప్రక్షాళన పేరుతో మరింత కాలయాపన చేస్తున్నారన్నారు. అమలు చేసే సత్తా లేనప్పుడు హామీలు ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. అందుకే ప్రజలు కాంగ్రెస్ అధికారం చేపట్టిన ఏడాదిలోనే పూర్తిగా విఫలమైందని తెలుసుకున్నారన్నారు. డిసెంబర్ 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు కాంగ్రెస్ పార్టీ పాలన తీరును ఎండగడుతూ ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి మండలంలో భారీ బైక్ ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో పార్టీ ట్రెనింగ్ సెల్ రాష్ట కన్వీనర్ సుదీంద్రాశర్మ, అసెంబ్లీ కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు విఘ్నేశ్, అనంత్‌రెడ్డి, వైభవ్‌రెడ్డి, మధుకర్ రెడ్డి, శ్రీకాంత్, మహేశ్, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, భార్గవ్‌రెడ్డి, శ్రీతంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైక్‌లు ఢీ.. వ్యక్తి దుర్మరణం

షాద్‌నగర్‌రూరల్: రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన పట్టణంలోని చటాన్‌పల్లి రైల్వేగేట్ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. వెల్జర్ల తండాకు చెందిన రవి(43) బైపాస్ రహదారిలోని యమ్మీ హోటల్‌లో పని చేస్తున్నాడు. కుటుంబంతో కలిసి చటాన్‌పల్లిలో నివాసం ఉంటున్నాడు. రవి తన స్కూటీపై రైల్వేగేట్ వైపు వస్తుండగా కేటీఆర్ చికెన్ సెంటర్ ముందు గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై ఎదురుగా వచ్చి స్కూటీని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో రవి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

బాత్రూంలో జారిపడి వృద్ధుడి మృతి

ఇబ్రహీంపట్నం రూరల్: బాత్రూంలో జారి పడి ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని రాగన్నగూడలో కాల్వ రామిరెడ్డి(71) నివసిస్తుండేవాడు. ఈ నెల 23న ఆయన అర్ధరాత్రి బాత్రూంలో జారి పడ్డాడు. అదే రోజు అస్వస్థతకు గురవ్వడంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అటునుంచి మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా ఆస్పత్రికి మార్చారు. అక్కడే చికిత్స పొందుతూ రామిరెడ్డి బుధవారం మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఫోన్ ట్యాపింగ్ కేసుపై విచారణ

- ముగ్గురిని కోర్టులో హాజరుపర్చిన పోలీసులు
- డిసెంబర్ 9వరకు రిమాండ్ పొడిగింపు

సిటీ, కోర్టులు: ఫోన్ ట్యాపింగ్ కేసుపై బుధవారం నాంపల్లి కోర్టులో విచారణ జరిగింది. జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న ప్రణీత్‌రావు, తిరుపతన్న, రాధాకిషన్‌రావును పోలీసులు ఎస్కార్ట్ సహాయంతో కోర్టులో హాజరుపర్చారు. హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో భుజంగరావు కోర్టుకు హాజరుకాకపోవడంతో ఆయన తరుపు న్యాయవాది పిటిషన్‌ను దాఖలు చేశారు. ఈ కేసుపై విచారణ చేపట్టిన నాంపల్లి కోర్టు ముగ్గురి రిమాండ్‌ను డిసెంబర్ 9వరకు పొడిగిస్తూ విచారణను ఆ రోజుకు వాయిదా వేసింది.

‘సింహగర్జన’ జయప్రదం చేయండి



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న అంజనేయులు తదితరులు

మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు

షాబాద్: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో డిసెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించే మాలల సింహగర్జన విజయవంతం చేయాలని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కంపేట ఆంజనేయులు కోరారు. బుధవారం మండల పరిధిలోని ముద్దెంగూడ, ఊబ్బగుంట, తిర్మలాపూర్ గ్రామాల్లో మాలల సింహగర్జన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్గీకరణ చట్టానికి వ్యతిరేకంగా పోరు చేయాలన్నారు. అందుకు మాలలు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజలు తదితరులున్నారు.

కల్లు విక్రయించే గుడిసె దగ్ధం

మొయినాబాద్: రోడ్డు పక్కన కల్లు విక్రయించడానికి వేసుకున్న గుడిసె దగ్ధమైంది. ఈ సంఘటన మండల పరిధిలోని పెద్దమంగళారంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గీత కార్మికులు కల్లు విక్రయించడానికి పెద్దమంగళారం–చందానగర్ రోడ్డు పక్కన గుడిసె ఏర్పాటు చేశారు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో గుడిసె తగులబడుతుండగా పెట్రోలింగ్ పోలీసులు గమనించి మంటలు ఆర్పారు. బుధవారం ఉదయం గీత కార్మికులు వెళ్లే సరికి గుడిసె కాలిపోయి ఉంది. గ్రామానికి చెందిన శివయ్యగౌడ్, సందీప్‌గౌడ్‌లపై గీత కార్మికుల సంఘం సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

చెట్టును ఢీ కొట్టిన కారు

శామీర్‌పేట్: కారు అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన జినోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నగరానికి చెందిన ఫర్హాన్ అహ్మద్ అన్సారి(23), షకీర్, రిజ్వాన్, అబ్దుల్లా స్నేహితులు. వీరు నలుగురు కలిసి కారు అద్దెకు తీసుకుని బుధవారం తెల్లవారుజామున కొండపోచమ్మ డ్యామ్‌కు బయలుదేరారు. అతివేగం కారణంగా మూడుచింతలపల్లి మండలం, కొల్తూర్ గ్రామ సమీపంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో డ్రైవర్ పక్క సీటులో ఉన్న ఫర్హాన్ అహ్మద్ అన్సారీ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కారు నడుపుతున్న షకీర్‌తో పాటు వెనక సీటులో కూర్చున్న రిజ్వాన్, అబ్దుల్లాకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పల్లె ప్రగతితో గ్రామాలాభివృద్ధి

సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి



సిక్కిం ప్రతినిధులతో సమావేశంలో పాల్గొన్న లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: పల్లె ప్రగతి కార్యక్రమంతో గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు(కడ్తాల్ మాజీ సర్పంచ్) గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాజేంద్రనగర్ జాతీయ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థలో రెండు రోజుల శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా సిక్కింకు చెందిన స్థానిక సంస్థల ప్రతినిధుల(సర్పంచ్)తో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీనర్సింహారెడ్డి.. గత గ్రామ పంచాయతీ పాలకవర్గంలో పల్లె ప్రగతి ద్వారా చేపట్టిన పనుల గురించి వివరించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడు గుంతల నిర్వహణ, పల్లె ప్రకృతి వనం, తడి పొడి చెత్త వేరుచేసే విధానం, రైతు వేదికలు, వైకుంఠధామాల నిర్మాణం, పంచాయతీలలో సొంత ఆదాయ వనరుల పెంపు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పల్లె ప్రగతి ద్వారా గ్రామాలు అభివృద్ధి చెందడం పట్ల సిక్కిం ప్రజాప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేసినట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ప్రొఫెసర్లు అంజన్‌కుమార్ బాంజియా, రవిబాబు, సిక్కిం గ్రామ పంచాయతీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో హోంగార్డు ఆత్మహత్యాయత్నం

- తన భూమిని దాయాదులు కబ్జా చేస్తున్నారని ఆరోపణ
- పోలీసులు న్యాయం చేయడం లేదని మనస్తాపం



మహ్మద్ ఘని హైమద్

ఘట్‌కేసర్: ఓ హోంగార్డు ఒంటిపై డీజిల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పరుశురాం కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. యాదాద్రి జిల్లా, మక్త అనంతారం గ్రామానికి చెందిన మహ్మద్ ఘని హైమద్ చెర్లపల్లి పీఎస్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. అతడికి ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎదులాబాద్ రెవెన్యూ పరిధిలో సర్వేనంబర్ 258, 268లో 30 గుంటల భూమి ఉంది. దాయాదులు అఫ్జల్, జబ్బార్ తన భూమి చుట్టూ ప్రహరీ నిర్మించుకోకుండా అడ్డుకుంటున్నారని మంగళవారం పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఇరువర్గాలను పిలిపించి మాట్లాడారు. అయినా తనకు న్యాయం చేయడం లేదని మనస్తాపానికి లోనైన మహ్మద్ ఘని బుధవారం సాయంత్రం బాటిల్‌లో డీజిల్ తీసుకుని స్టేషన్‌కు వచ్చాడు. నేరుగా ఇన్‌స్పెక్టర్ క్యాబిన్‌లోకి వెళ్లిన అతను ఆయన ఎదుటే డీజిల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తక్షణమే స్పందించిన ఇన్‌స్పెక్టర్, ఇతర పోలీసులు అతడి నుంచి డీజిల్ బాటిల్‌ను లాక్కున్నారు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ మేరకు అతడిపై ఆత్మహత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బ్యాటరీ బైక్ పేలి..

మరో 8 బైకులు దగ్ధం



దగ్ధమైన బైకులు

రామంతాపూర్: ఓ ఇంట్లో పార్కింగ్ స్థలంలో నిలిపి ఉన్న బ్యాటరీ బైక్ పేలడంతో దాని పక్కనే ఉన్న మరో 8 బైకులు దగ్ధమైన సంఘటన వివేక్‌నగర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. డివిజన్ పరిధిలోని వివేక్‌నగర్‌లో జయరాములు అనే వ్యక్తి తన ఎలక్ట్రిక్ బైక్‌ను పార్కింగ్ స్థలంలో ఉంచాడు. తెల్లవారు జామున బైక్ బ్యాటరీ పేలిపోవడంతో మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో పక్కనే పార్క్ చేసిన మరో ఎనిమిది బైకులు పూర్తిగా దగ్ధమయ్యాయి. వీటిలో రెండు బ్యాటరీ బైకులతో పాటు మరో ఆరు పెట్రోల్ బైకులు ఉన్నట్లు సమాచారం. స్థానికులు మంటలను ఆర్పేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఫైరింజన్ సంఘటనా స్థలానికి చేరుకునేలోపు వాహనాలన్నీ కాలిబూడిదయ్యాయి. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.